క్లుప్తంగా

ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి

చాగలమర్రి: యువ రైతులు సంప్రదాయ పంటలనే కాకుండా, వాణిజ్య ఉద్యానవన పంటలైన మామిడి, సపోటా, జామ, జాతీయ స్థాయి మార్కెట్‌లో డిమాండు ఉన్న డ్రాగన్ ఫ్రూట్ లాంటి రకాల పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసి తద్వారా అధిక లాభలను పొందాలని ఎంపీపీ వీరభద్రుడు తెలిపారు. మండల కేంద్రం సమీపంలోని నారాయణపల్లె గ్రామ రస్తాలో యువ రైతు ఉల్లి రమేష్ తన 4 ఎకరాల్లో సాగు చేసిన జంబో రెడ్ జాతికి చెందిన (గుజరాతీ వంగడం) డ్రాగన్ ఫ్రూట్ పంట కోతను సోమవారం మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 30 రోజుల పాటు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ బోధనపై నిర్వహించిన శిక్షణ సోమవారం ముగిసిందని ప్రిన్సిపాల్ శశికళ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న బీఏ, బీకాం, బీఎస్సీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. ఇందులో ఆంగ్ల భాషపై పట్టు, విలువ ఆధారిత విద్య ద్వారా వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందని తెలిపారు. ఈ శిక్షణ అందించిన చేయింజ్ మేకర్ జనార్ధన్‌ను ప్రశంసించారు.

విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దక్కా కుమార్, నిరంజన్ కోరారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట 8 గంటల దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధుకిరణ్, ప్రతాప్, రమేష్, సిద్ధార్థ, కార్తీక్, అబ్దుల్‌ఖాన్, లోకేష్, చరణ్ పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరం

నంద్యాలటౌన్: స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న 32వ ఉచిత చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల వైద్య శిబిరం సోమవారం ముగిసింది. డాక్టర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ మధుమణి చారిటబుల్ సొసైటీ సహకారంతో నిర్వహించిన శిబిరంలో మొత్తం వంద మందికి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశామన్నారు. రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డాక్టర్ మధుసూదనారావు చేసిన సేవలను అభినందిస్తూ ఐఎంఏ జాతీయ నాయకత్వం ఐఎంఏ వైద్యుల దినోత్సవ జాతీయ సేవా పురస్కారానికి ఆయనను ఎంపిక చేసిందని తెలిపారు.

పారిశుద్ధ్యం లోపించనీయొద్దు

దొర్నిపాడు: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని క్రిష్టిపాడు గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు గ్రామ రహదారిపై పేరుకుపోయిన మురుగు, బురదను తొలగించారు.

మైనార్టీ అధికారిని నియమించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాకు రెగ్యులర్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌ను నియమించాలని ఆంధ్రప్రదేశ్ డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ కోరారు. సోమవారం ఈ మేరకు స్పందనలో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మైనార్టీ రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

కుష్టు వ్యాధి నివారణకు కృషి



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: కుష్టు వ్యాధి నివారణకు కృషి చేస్తున్నామని జిల్లా లెప్రసీ పారా మెడికల్ జిల్లా అధికారి డాక్టర్ విజయకుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో జరుగుతున్న కుష్టు వ్యాధిపై సర్వేను పరిశీలిలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి గుర్తింపు జూన్ 16 నుంచి మొదలై ఈనెల 24తో ముగిసిందన్నారు. మండలంలో 3 కేసులు నిర్ధారణ అయ్యాయని నివారణకు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు చికిత్స అందజేస్తామని చెప్పారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ప్రసాదు, స్థానిక వైద్యుడు విజయకుమార్, సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపుతున్నాం



భూమి పూజ చేస్తున్న షేక్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా తెలిపారు. సోమవారం స్థానిక 41వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ రూ. 20లక్షలతో పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్ పున్నారాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పున్నాశేషయ్య, డీఈఈ జయభారత్‌రెడ్డి పాల్గొన్నారు.



నీలివీధిలో వెలసిన బీఫాతిమా తల్లిపీరు



ముల్లాన్‌పేటలో వెలసిన హుసేన్‌ఆలం



అగ్నిగుండ ప్రవేశానికి సిద్ధం ఉన్న దృశ్యం

త్యాగానికి ప్రతీక మొహర్రం

- 20న అర్ధరాత్రి పీర్ల పెట్టకు ప్రత్యేక ఫాతెహాలు
- పట్టణంలో ఆయా మకానాల్లో కొలువుదీరిన పీర్లు
- తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలో పూజలు
- 29న పట్టణంలో భారీగా పీర్ల ఊరేగింపు, నిమజ్జనం



గాంధీచౌక్‌లో హసన్ పీర్లు

నంద్యాల(వ్యవసాయం): శాంతి స్థాపన కోసం 14శాతాబ్దాల క్రితం జరిగిన చారిత్రాత్మక యుద్ధాలలో ఆసువులుబాసిన వీరుల సంస్మరణార్థం ముస్లింలు మొహర్రంను భక్తు శ్రద్ధలతో జరుపుకుంటారు. మొహర్రం నెలతోనే ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. అందుకే ఈ మాసాన్ని షాహిద్ మాసంగా ముస్లింలు పిలుచుకుంటారు. వాస్తవానికి విషాద రోజులు అయినప్పటికీ తెలుగు నెలల్లో పీర్ల పండుగగా పిలుస్తారు. పట్టణంలో మత సామరస్యానికి ప్రతీకగా ఈ పండుగ నిలుస్తుంది. అన్ని మతస్తుల వారు అత్యంత భక్తిశ్రద్ధలతో పీర్లను పూజిస్తారు. పట్టణంలో దాదాపు 25కు పైగా పీర్లచావిడిలు (మకాన్) ఉన్నాయి.

ముస్తాబైన మకాన్‌లు..

ఈనెల 20న గురువారం అర్ధరాత్రి పీర్ల పెట్టెను బయటకు తీసి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. అలాగే గుద్దేలు తవ్వారు. గత రెండు రోజులుగా వివిధ రకాల పీర్లను మకాన్‌లో కొలువుంచారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఫాతెహాలు, ఆధ్యాత్మిక గ్రంథాలను పఠిస్తారు. మకాన్, పీర్లను వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో విశేషంగా అలంకరించారు. పీర్లను పుష్పాలు, దట్టీలు, బాసికంతో ముస్తాబు చేశారు. పట్టణంలో నీలివీధిలో బీఫాతిమా (తల్లిపీరు), ముల్లాన్‌పేటలో షైజ్‌జఫార్ వలి దర్గా వద్ద, హుసేన్‌ఆలం, కల్పనాసెంటర్‌లో ఇమాంఖాశీం, చాంద్‌బాడలో అలీఅక్బర్, ఇమాం ఖాశీం, అలీఅబ్బాస్, మాల్దారిపేటలో మౌలాలి స్వామి, నడిగడ్డ, తొట్టిబావి వద్ద ఉజాలాతాబుచ్, గాంధీచౌక్‌లో హసన్, జమాల్‌బాషా దర్గా వద్ద అలీ అక్బర్, అలిఅక్షర్, బాదూల్‌సాహెబ్‌లు, సాదిక్‌నగర్‌లో అలిఅక్బర్, ఊహన్‌అలీమ్, మౌలాలిస్వామి, నూనెపల్లె, ఏకలవ్యనగర్‌లలో దస్తగిరిస్వామి, ఇమాంఖాశీం, మౌలాలిస్వాముల పీర్లు పూజలందుకుంటున్నాయి. ముజావర్లు ఉదయం, సాయంత్రం పీర్లను ప్రత్యేక పూలతో అలంకరించి ఫాతెహాలు నిర్వహిస్తారు. మొహర్రం 7వ రోజు చిన్నసరిగెత్తు కార్యక్రమం, 9వ రోజు శుక్రవారం పెద్ద సరిగెత్తు ప్రాముఖ్యత గలవి. ఆయా రోజుల్లో భక్తులు ఉదయం నుంచే పీర్ల చావిళ్లకు వెళ్లి పూలహారాలు, బాసికాలు, టెంకాయలు, మలీదా వంటివి పీర్లకు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. రాత్రి పీర్లచావిడి ఎదురుగా అగ్నిగుండాలు చేసి అర్ధరాత్రి భక్తులు ఈ అగ్నిగుండాల్లోకి ప్రవేశిస్తారు. కొన్ని పీర్లను అర్ధరాత్రి దివిటీలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. చివరి రోజు శనివారం సాయంత్రం షాదత్ (ఏటికి తరలింపు) కార్యక్రమం జరుగుతుంది. చివరి రోజు అన్ని పీర్లు కల్పనా సెంటర్ వద్దకు చేరుకొని గాంధీచౌక్, బంగారు అంగళ్లు, పెద్దబండ, ఆర్టీసీ బస్టాండ్, రాణిమహారాణి థియేటర్ వద్ద ఉన్న కుందూనది వద్ద నిజమన్జం పూర్తి చేశారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచే పీర్లు పట్టణంలో ఊరేగింపుగా బయల్దేరి మధ్యాహ్నం మకాన్‌లకు చేరుకొని సాయంత్రం ఆధ్యాత్మిక చింతనతో మహిళలు ఉపవాసం ఉండి షాదత్ కార్యక్రమం అనంతరం ఉపవాసాన్ని త్యజిస్తారు. ఏటికి వెళ్లే కార్యక్రమంలో భాగంగా పీర్ల ఊరేగింపునకు భక్తులు, పట్టణవాసులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివస్తారు. దీంతో పట్టణ వీధులు కిటకిటలాడతాయి.

కొలువుదీరిన పీర్లు

రుద్రవరం: మండలంలో మొహర్రం పూజలు ప్రారంభమయ్యాయి. పండుగ మొదలై ఐదు రోజులు కావడంతో సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని చావిళ్లలో నిర్వాహకులు పీర్లను కొలువుదీర్చారు. ఆయా గ్రామాల్లోని చావిళ్ల ప్రాంగణాల్లో యువకులు అగ్ని గుండాలు తవ్వారు. రుద్రవరంలో మౌలాలి స్వామి సరిగెత్తు కావడంతో గ్రామస్తులు చావిడి వ్దకు వెళ్లి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు.

మున్సిపల్ స్పందనకు ఒక ఫిర్యాదు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాయంలో సోమవారం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్ ఆధ్వర్యంలో జరిగిన స్పందనకు ఒక ఫిర్యాదు వచ్చింది. ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాల్లో రోజూ స్పందన నిర్వహిస్తున్నందున మున్సిపల్ స్పందనకు ఫిర్యాదులు తగ్గాయని చెప్పారు. పట్టణ ప్రజలు తమ సమస్యలను వార్డు సచివాయాల్లో జరిగే స్పందనలో అర్జీలు అందజేయాలని, అక్కడ పరిష్కారం కాకపోతే తమకు అందజేయాలని చెప్పారు.

బయోమెట్రిక్ డివైజ్‌ల పంపిణీ

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 31వ వార్డు వలంటీర్లకు సొంత ఖర్చుతో బయోమెట్రిక్ డివైజ్‌లను జేసీఎస్ కన్వీనర్ దాల్‌మిల్ అమీర్ సోమవారం పంపిణీ చేశారు. స్థానిక మూలసాగరం 31వ వార్డు సచివాయలంలో నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్లకు ఆయన డివైజ్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ, పింఛన్ల పంపిణీ త్వరితగతిన పూర్తి చేసేందుకు వీటి అవసరముందని వలంటీర్లు కోరడంతో పరికరాలను అందజేశామని చెప్పారు. 31వ వార్డు ఇన్‌చార్జ్ భాస్కరరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డివైజ్‌లను పంపిణీ చేస్తున్న దాల్‌మిల్ అమీర్

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): ఆదోనిలో ఈనెల 23న జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో నంద్యాల కాళికాంబ వ్యాయామశాలకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారని కోచ్ చెన్నంశెట్టి పుల్లయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన సుమంత్, ఆనంద్, వీరన్న, నాగమల్లయ్య, పుల్లయ్య, రాజును అభినందించారు. రాజు మొదటి స్థానంలో నిలిచినట్లు చెప్పారు. స్ట్రాంగ్‌మెన్ వీరన్న సుమశ్రీ రవి పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

511 లీటర్ల పాలతో అభిషేకం

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి సోమవారం 511 లీటర్లతో పాలాభిషేకం చేశారు. ఈఓ రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన వేణుగోపాల్, రమాదేవి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి 511లీటర్ల పాలతో అభిషేకం చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ, కృష్ణయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అయ్యంకి వెంకటరమణయ్య సేవలు మరువలేనివి

నంద్యాల(వ్యవసాయం): గ్రంథాలయ ఉద్యమ సారథి పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయోద్యమంలో చేసిన సేవలు మరువలేనివని రిటైర్డు ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ శివనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో వెంకటరమణయ్య 133వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ 1934-48లో కోస్తా ఆంధ్ర ప్రాంతంలో అనేక గ్రంథాలయాలను ఏర్పాటు చేశారని, 1972లో పద్మశ్రీ పురస్కారం, పలు బిరుదులను అందుకున్నారని గుర్తు చేశారు. కవులు మహమ్మద్ రఫీ, నీలకంఠమాచారి, గ్రంథాలయ ఇన్‌చార్జ్ శ్రీధర్, సుబ్బారెడ్డి, సత్యమూర్తి పాల్గొన్నారు.



వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విద్యుత్ సమస్యకు పరిష్కారం

ఉయ్యాలవాడ: మండలంలోని తుడుమలదిన్నె, గోవిందపల్లె గ్రామాలకు రూ.19 లక్షలతో ఇంటర్ లింకింగ్‌లైన్ ఏర్పాటు చేయడంతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది. ఈ నెల 1న తుడుమలదిన్నె గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పేరుసోముల నుంచి తమ గ్రామాలకు విద్యుత్ సరఫరా అందుతుందని, అయితే నిత్యం అంతరాయం ఏర్పడుతోందని, దీంతో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సమస్యను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రతిపాదనలు తయారు చేసి నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు పుచ్చకాయలపల్లె గ్రామం నుంచి 2.5 కి.మీ. పొడువున 62 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించి నూతనంగా విద్యుత్‌లైన్ ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని విద్యుత్ ఏఈ గురప్ప సోమవారం తెలిపారు. కేవలం 24 రోజుల్లోనే పనులు పూర్తి కావడంతో పై రెండు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



పుచ్చకాయలపల్లె వద్ద ఇంటర్ లింకింగ్ లైన్‌కు స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నేడు 'జగనన్న సురక్ష'

ఉయ్యాలవాడ : మండల కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సోమవారం తెలిపారు.

రేపు మండల మీట్

నంద్యాల(అర్బన్): ఈనెల 26వ తేదీన నంద్యాల మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ ప్రభాకర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని సూచించారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోండి

నంద్యాల(అర్బన్): వెలుగోడు పరిసర ప్రాంతాల్లో ఆవులను మేపుకుంటున్న గిరిజనులను అడ్డగిస్తున్న ఫారెస్ట్ రేంజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆవులను మేపుతూ గిరిజనులు జీవనోపాధులు పొందుతున్నారన్నారు. వేరే ఆధారం లేని వారిని వేధించడం తగదన్నారు. నాయకులు విక్రమ్‌నాయక్, బాలునాయక్, శంకర్ నాయక్, సుకృనాయక్ పాల్గొన్నారు.

క్రీడా సంబరాల కార్యాచరణ సిద్ధం చేయండి

నంద్యాల: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా సంబరాలకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 2న జాతిపిత మహాత్మా గాంధీ జయంతి రోజున ఆడుదాం ఆంధ్ర పేరిట నిర్వహించనున్న క్రీడా సంబరాలకు సంబంధించిన చర్యలు ముమ్మరం చేయాలని చెప్పారు. సచివాలయాల స్థాయి నుంచి మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో సెట్కూర్ సీఈఓ రమణ, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

ఆళ్లగడ్డ: మృతుడు శంకర్‌రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆళ్లగడ్డ, పుట్టపర్తి ఎమ్మెల్యేలు గంగుల బిజేంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శంకర్‌రెడ్డి సోమవారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఆళ్లగడ్డ, పుట్టపర్తి ఎమ్మెల్యేలు యాదవాడ చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

రైతులు మెళకువలు పాటించాలి

రుద్రవరం: మిర్చి పంట సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించ వచ్చని శాస్త్రవేత్తలు బాలరాజు, ఆదినారాయణ, కృష్ణమూర్తి రైతులకు సూచించారు. రుద్రవరం పరిసరాల్లో రైతులు సాగు చేసిన మిర్చి పంటను సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, మందులు వాడటం వల్ల ఖర్చు పెరుగుతుందని, ఖర్చు తగ్గింపులపై వారికి అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖాధికారి నరేష్‌కుమార్‌రెడ్డి మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఏఈఓ రాజు ఉన్నారు.



రుద్రవరం సమీపంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారులు

వలంటీర్ తోడ్పాటు మరువలేనిది

ఈ ఫొటోలో దివ్యాంగుడు మక్తుంసా మాబుకు రేషన్ బియ్యం ఇంటి వద్దకు తెచ్చి ఇస్తున్న వలంటీర్ పేరు డి.సిద్ధిఖ్. కరోనా మొదటి దశలో జనం బయటకు రావడానికి జంకే వారు. దీంతో పాటు లాక్‌డౌన్ ఉండటంతో ఇంటి నుంచి బయటకు రాలేకపోయేవారు. చాగలమర్రిలోని 2వ సచివాలయ పరిధిలోనున్న 5వ వార్డులో తనకు కేటాయించిన ఇళ్లకు వలంటీర్ సిద్ధిఖ్.. వారి ఇళ్ల వద్దకే సరుకులు, రేషన్, మందులు, ఇతర ప్రభుత్వ పథకాలను చేరవేసేవాడు. ఇలా ఇంటింటికీ తిరిగి అందజేస్తుండటంతో స్థానికులు అభినందించడంతో తమ కుటుంబ సభ్యుడిలా భావిస్తున్నారు. - చాగలమర్రి



కరోనా సమయంలో దివ్యాంగుడైన మక్తుంసా మాబుకు రేషన్ బియ్యం అందజేస్తున్న వలంటీరు డి.సిద్ధిఖ్

నాకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నాడు



దివ్యాంగుడైనందున కరోనా సమయంలో బయటకు రాలేకపోయేవాడిని. ఆ సమయంలో నాకు ఏ అవసరమైనా వలంటీర్ సిద్ధిఖ్ చూసుకునేవాడు. చివరకు రేషన్ బియ్యం కూడా ఇంటికే తెచ్చి ఇచ్చేవాడు. ఆ తరువాత కూడా నాకు స్థలం ఉన్నా ఇల్లు లేకపోవడంతో మంజూరు చేయించాడు. దీంతో ప్రభుత్వం రూ.1.80లక్షలు అందజేసింది. ఆ మొత్తంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నా. అలాగే పింఛన్ ప్రతి నెల ఇంటికే వచ్చి ఇస్తున్నాడు. అసరమైనప్పుడు మందులు కావాని చెబితే వెంటనే తెచ్చిఇస్తున్నాడు. ప్రతి విషయంలో సహకరంగా ఉంటూ కుటుంబ సభ్యుడి కన్నా ఎక్కువగా చూసుకుంటున్నాడు.

– మక్తుంసా మాబు, చాగలమర్రి

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: నవరత్నాలతో ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆర్.నాగులవరం సచివాలయ పరిధిలోని ఆర్.కొత్తపల్లె, టి.టింగందిన్నె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డు సచివాలయాలు పట్టణాల్లో, గ్రామాల్లో శాశ్వత అభివృద్ధికి చిరునామాలుగా చరిత్రలో నిలిచిపోనున్నాయన్నారు. తమ ప్రభుత్వం ఏమి చేసింది, సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందింది వివరాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వాలు ఇంత ఎద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. ప్రతీ పథకం ప్రజలో గుండెల్లో నిలిచిందన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల సీఎం అంటూ చెప్పుకోవడానికి ఉన్నారే గానీ చెప్పుకోవడానికి ఒక్క పథకం ప్రజల్లో లేదని ఎద్దేవా చేశారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, నాయకులు గంధం రాశిరెడ్డి, సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, బద్రి ఎర్రన్న, వెంకటన్న, జాకీర్ హుసేన్, నూకల కృష్ణమూర్తి, హరినారాయణ, డేగ వెంకటేష్, మహేష్‌రెడ్డి, వినోద్‌కుమార్ రెడ్డి, బాలీశ్వరరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగముని, వెంకటసుబ్బయ్య, కందుకూరి గోపాల్‌రెడ్డి, నారాయణ, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, రాఘువేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి కృషి

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ ముస్లీం మైనార్టీలకు అండగా నిలిచి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. ముస్లిం తోఫా రూ.50వేల నుంచి రూ.లక్షకు పెంచిన సందర్భంగా సోమవారం నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం చేరుకుని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముస్లీం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దస్తగిరి, పీరయ్య, హసన్ ఉన్నారు.



ఎమ్మెల్యే గంగులను సన్మానిస్తున్న ముస్లిం, మైనార్టీలు

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

దొర్నిపాడు: మృత్యుతీగలు పాడిగేదెలను పొట్టన పెట్టుకున్నాయి. కురుస్తున్న వర్షాలకు స్తంభానికి ఉన్న ఇన్సులేటర్ పగిలి విద్యుత్ తీగలు తెగి కిందపడ్డంతో పాడిగేదెలు మృతి చెందినట్లు తెలిసింది. మేతకు వెళ్లిన గేదెలు తీగను తాకడంతో ఒకదాని వెంట ఒకటి వెళ్లి ప్రాణాలు వదిలిన ఘటన సోమవారం మండలంలోని గుండుపాపల శివారులోని పొలాల్లో చోటుచేసుకుంది. చాకలి మద్దిలేటికి చెందిన 4 గేదెలు, బోనాల పెద్ద నరసింహులు, డొల్లు ఏగన్నకు చెందిన చెరొక గేదె మృత్యువాతపడ్డాయి. విత్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే సమస్య జరిగినట్లు రైతులు వాపోయారు. సుమారు రూ.4లక్షల విలువ చేస్తాయని బాధిత రైతుల పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన గేదెలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పశువైద్యాధికారులు బీమా వచ్చేలా చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు.



మృతి చెందిన గేదెలను పరిశీలిస్తున్న ఎంపీపీ, గ్రామస్తులు

ఏఈఐ కేసు నమోదు..

గేదెలు మృతి చెందిన ఘటనలో కోవెలకుంట్ల విద్యుత్ శాఖ ఏఈ రామ్మోహన్‌పై సోమవారం దొర్నిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గేదెలు మృత్యువాత పడటానికి ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ తెలిపారు.

సంక్షిప్తం

కేసు నమోదు

ఆళ్లగడ్డ: పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, ప్రభుత్వ అనుమతి తీసుకోకుండా రోడ్డుపై బైఠాయించి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించిన 27 మంది సీపీఐ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదుట కోవెలకంట్ల, ఆళ్లగడ్డ ప్రధాన రోడ్డుపై సోమవారం బైఠాయించి వాహనాల రాకపోకలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఆటంకం కల్గించడంతో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయుడు, బాబాపకృద్దీన్, నాగరాముడు, ధనుంజయుడులతో పాటు మరో 22 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

కొత్త భూ చట్టం తేవాలి

నంద్యాల(అర్బన్): పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇస్తున్న 54వేల ఎకరాల భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరగకుండా కొత్త చట్టం తేవాలని ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ కోరారు. ఎన్నో ఏళ్లుగా భూ పంపిణీ లేక భూమి లేని పేదలు ఇబ్బందులు పడ్డారని, ప్రభుత్వం భూములు ఇవ్వడం హర్షనీయమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న భూములకు భూ బదలాయింపు లేకుండా చట్టం వచ్చేలా చూడాలంటూ సోమవారం డీఆర్ఓ పుల్లయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ భూములపై మహిళలకు తరతరాలుగా అనుభవించే సంపూర్ణ హక్కు ప్రభుత్వం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇస్తున్న భూములను 20 ఏళ్ల తర్వాత అమ్ముకొనే అవకాశం లేకుండా చూడాలన్నారు. రాధమ్మ, మద్దమ్మ, పుల్లమ్మ, పూలరాజు, విజయ్‌కుమార్, లక్ష్మయ్య, రవికిరణ్, కృష్ణ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై చర్యలు తీసుకోవాలి

గోస్పాడు: మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలతని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బస్టాండ్ దగ్గర ఆందోళన కార్యక్రమం చేపట్టారు. నాయకుడు గోకారి మాట్లాడుతూ దళిత, గిరిజన మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. జిలాన్ బాషా, హరినాథ్, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య నడిపి వెంకటేశ్వర్లు పెద్ద కంబగిరి పాల్గొన్నారు.

రస్తా చూపండి సార్!

ఉయ్యాలవాడ : కాలనీ వాసులు బయటకు వెళ్లేందుకు రస్తా చూపాలంటూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుకు హరివరం గ్రామస్తులు వినతిపత్రం అందజేసి అభ్యర్థించారు. గ్రామానికి చెందిన పామిలేటి, శివప్రసాద్, సువర్ణ, లలితమ్మ, హసీనా, హుసేన్‌బీతో పాటు పలువురు కాలనీ వాసులు మాట్లాడుతూ గ్రామం నుంచి గుళ్లదుర్తికి వెళ్లే రస్తాలో ముళ్ల చెట్లు అల్లుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారాయన్నారు. రస్తాను బాగు చేయాలని కోరారు. రెండు రోజుల్లో గ్రామాన్ని సందర్శించి తహసీల్దార్ రవికుమార్‌తో కలిసి రస్తా సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇవ్వడంతో వారు వెరుదిరిగి వెళ్లారు. వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణారెడ్డి, ఫణీత్ కృష్ణ, ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.